

ఇచ్చిన మాట నిలబెట్టుకున్నా..

బుగ్గపాడు నిర్వాసితులకు ఇచ్చిన హామీ మేరకు పరిహారం మంజూరు చేయించానని సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య తెలిపారు. 2లో



పోరాట ఆదర్శరాలు ఐలమ్మ

తెలంగాణ సాయుధ పోరాటానికి చాకలి ఐలమ్మ ఆదర్శరాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం వెల్లడించారు. 2లో

గరిష్టం / కనిష్టం
$34^{\circ} / 25^{\circ}$

వాతావరణం

జిల్లాలో ఆదివారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. కొన్నిచోట్ల మధ్యాహ్నం తర్వాత ఎండ పెరిగే అవకాశముంది.

న్యూస్‌రీల్

శ్రీవారికి ప్రత్యేక పూజలు



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఎర్రుపాలెం: తెలంగాణా తిరుపతిగా పేరున్న జమలాపురంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ ప్రాంగణంలోని శ్రీవారి పాదంతో పాటు మూలవిరాట్‌కు అర్చకులు శాస్త్రోక్తంగా పంచామృతాలతో అభిషేకం జరిపించారు. అలాగే స్వామి, అమ్మవార్లను పట్టువస్త్రాలతో అలంకరించి వేలాదిగా హాజరైన భక్తుల సమక్షాన నిత్య కల్యాణం జరిపించారు. ఆ తర్వాత కనులపండువగా పల్లకీసేవ జరిగింది. ఆలయ చైర్మన్ ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ఈఓ జగన్మోహన్‌రావు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

మెడికల్ కళాశాల ఆర్‌ఎంఓగా కోటాచలం

ఖమ్మం వైద్యవిభాగం: ఖమ్మం మెడికల్ కళాశాల ఆర్‌ఎంఓగా సివిల్ సర్జన్ డాక్టర్ కోటాచలం నియమితులయ్యారు. ఈమేరకు హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డైరెక్టర్ జి. శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం సూర్యాపేట డీఎంహెచ్‌ఓగా విధులు నిర్వర్తిస్తున్న ఆయనను వెంటనే ఆర్‌ఎంఓగా విధుల్లో చేరాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా, ప్రస్తుతం ఉన్న ఆర్‌ఎంఓ బి.శ్రీనివాసరావును మరికొంత కాలం కొనసాగించనున్నారు. మెడికల్ కళాశాలకు మరో ముగ్గురు ఆర్‌ఎంఓలను కేటాయించే అవకాశమున్నందున పూర్తిస్థాయి ఆర్‌ఎంఓ కోటాచలం పర్యవేక్షణలో మిగతా వారు విధులు నిర్వర్తిస్తారు.

పీఓఎస్ ద్వారానే ఎరువుల అమ్మకాలు



భగవత్‌వీడుతో వరిని పరిశీలిస్తున్న డీఏఓ

కూసుమంచి: పీఓఎస్ మిషన్ ద్వారానే డీలర్లు ఎరువులు విక్రయించాలని జిల్లా వ్యవసాయాధికారి సరిత సూచించారు. కూసుమంచిలోని పలు ఎరువుల దుకాణాలను శనివారం ఆమె తనిఖీ చేశారు. ఈసందర్భంగా స్టాక్ రికార్డులు పరిశీలించాక డీలర్లతో మాట్లాడారు. స్టాక్, అమ్మకాల వివరాలతో రికార్డులు పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. అనంతరం మండలంలోని భగవత్‌వీడులో పంట నమోదు కార్యక్రమాన్ని డీఏఓ సరిత పరిశీలించి తెగుళ్ల నివారణపై రైతులకు సూచనలు చేశారు. ఈకార్యక్రమంలో ఏడీఏ విజయచంద్ర, ఏఓ వాణి, ఏఈఓ ఉపేందర్ పాల్గొన్నారు.

ఖర్గే సమక్షాన కాంగ్రెస్‌లోకి..



పార్టీలో చేరిన తర్వాత ఖర్గేతో తుమ్మల నాగేశ్వరరావు, పక్కన భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఠాక్రే, రేవంత్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, యుగేందర్ తదితరులు

హస్తం గూటికి చేరిన మాజీ మంత్రి తుమ్మల

- బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేస్తూ లేఖ
- సీడబ్ల్యూసీ హాల్‌లోకి తుమ్మలతో పాటు తనయుడు
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అనుచరుల సంబరాలు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కాంగ్రెస్‌లో చేరారు. సీడబ్ల్యూసీ సమావేశాలు హైదరాబాద్‌లో జరుగుతుండగా.. ఆయన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే సమక్షాన పార్టీ కండువా కప్పుకున్నారు. అత్యంత కట్టుదిట్టమైన భద్రతా నడుమ సీడబ్ల్యూసీ భేటీ జరుగుతుండడంతో అక్కడకు తుమ్మలతో పాటు ఆయన తనయుడు యుగేందర్‌ను మాత్రమే అనుమతించారు. ఆతర్వాత సాయంత్రం ఏఐసీసీ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీని కూడా తుమ్మల కలిశారు. కాగా, తుమ్మల చేరికతో ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలం మరింత పుంజుకున్నట్లయింది. దీంతో పార్టీ శ్రేణులు బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు.

చిరకాల ప్రత్యర్థి పార్టీలోకే..

తుమ్మల నాగేశ్వరరావు రాజకీయ ప్రస్థానం 1983లో ప్రారంభమైంది. అదే ఏడాది జరిగిన ఎన్నికల్లోనే కాక 1989లోనూ సత్తుపల్లి నుంచి టీడీపీ తరఫున పోటీ చేసిన ఆయన ఓటమి చెందారు. మళ్లీ 1994, 1999లో సత్తుపల్లి స్థానం నుంచే గెలిచారు. ఆతర్వాత 2004లో సత్తుపల్లి నుంచి పోటీ చేసి జలగం వెంకట్రావుపై ఓడిపోయారు. 2009లో సత్తుపల్లి స్థానం ఎస్సీకి రిజర్వ్ కావటంతో ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఇండిపెండెంట్‌గా పోటీ చేసిన జలగం వెంకట్రావుపై స్వల్ప మెజార్టీతో గెలుపొందారు. 2014లో కాంగ్రెస్ అభ్యర్థి పువ్వాడ అజయ్‌పై పోటీ చేసి ఓడిన తుమ్మల... తెలంగాణ ఏర్పాటుతో టీడీపీని వీడి టీఆర్‌ఎస్‌లో చేరారు. 2016లో పాలేరు ఉప ఎన్నికల్లో టీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి గెలిచినా, 2018లో కాంగ్రెస్ అభ్యర్థి కందాల ఉపేందర్‌రెడ్డి చేతిలో ఓటమి చెందారు. అలా టీడీపీలో మొదలైన రాజకీయ ప్రస్థానం బీఆర్‌ఎస్‌లోకి చేరగా... తుమ్మల తొలి నుంచి కాంగ్రెస్ అభ్యర్థులతోనే తలపడి గెలుపోటములు చవిచూశారు. ఇప్పుడు రాజకీయ ప్రత్యర్థి అయిన కాంగ్రెస్ పార్టీలోకే చేరారు.

విజయభేరికి భారీగా తరలేలా..

హైదరాబాద్‌లోని తుక్కుగూడ వద్ద ఆదివారం కాంగ్రెస్ ఆధ్వర్యాన విజయభేరి సభ జరగనుంది. ఈసభకు ఉమ్మడి జిల్లా నుంచి భారీగా వెళ్లేలా పార్టీ శ్రేణులు ఏర్పాట్లు చేసుకున్నారు. ఇప్పుడు తుమ్మల కూడా పార్టీలో చేరడంతో ఆయన అనుచరులే కాక సీఎల్పీ నేత భట్టి, పొంగులేటి అనుచరులు సిద్ధమయ్యారు. ఇంకా అన్ని నియోజకవర్గాల నుంచి టికెట్ ఆశిస్తున్న వారు సైతం తమ అనుచరులతో విజయభేరికి తరలేందుకు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

కేసీఆర్‌కు రాజీనామా లేఖ

కాంగ్రెస్ పార్టీలోకి తుమ్మల చేరికకు ముహూర్తం కుదరడంతో ఆయన శనివారం.. సీఎం కేసీఆర్‌కి రాజీనామా లేఖ పంపారు. 'శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖరరావు గారు, బీఆర్‌ఎస్ అధ్యక్షులు అని పేర్కొంటూ తెలంగాణ రాష్ట్ర సమితిలో నాకు సహకరించినందుకు ధన్యవాదాలు. పార్టీకి రాజీనామా సమర్పిస్తున్న' అని సంతకంతో లేఖ రాశారు. ఆతర్వాతే సీడబ్ల్యూసీ సమావేశాలు జరుగుతున్న తాజ్ కృష్ణ హోటల్‌కి వెళ్లారు. తుమ్మలతో పాటు ఆయన తనయుడు యుగేందర్‌ని మాత్రమే అనుమతించగా, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే తుమ్మలకు పార్టీ కండువా కప్పారు. ఈ కార్యక్రమంలో కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, ఏఐసీసీ జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ.వేణుగోపాల్, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క, ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, టీపీసీసీ ప్రచార కమిటీ కో చైర్మన్ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలతో పాటు పలువురు ముఖ్య నేతలు పాల్గొన్నారు.



రాహుల్‌గాంధీతో తుమ్మల, రేవంత్, భట్టి విక్రమార్క, యుగేందర్

అనుచరుల సంబరాలు

తుమ్మల కాంగ్రెస్‌లో చేరడంతో ఉమ్మడి జిల్లాలో ఆయన అనుచరులు బాణాసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. బీఆర్‌ఎస్ టికెట్ నిరాకరించినప్పటి నుంచి నైరాశ్యంలో ఉన్న అనుచరుల్లో తుమ్మల కాంగ్రెస్‌లో చేరడం జోష్ నింపింది. ఆయనను కాంగ్రెస్‌లోనే చేరాలని అనుచరులు కోరుతుండడంతోనే 'చేయి' అందుకున్నట్లు తెలిసింది.

వైద్య, విద్యారంగాల బలోపేతమే లక్ష్యం



కొదుమూరులో పల్లె దవాఖానా భవనాన్ని ప్రారంభించిన మంత్రి అజయ్‌కుమార్, పక్కన కలెక్టర్ గౌతమ్, జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్ తదితరులు

- ఆ దిశగా రాష్ట్రప్రభుత్వం కృషి
- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

చింతకాని: రాష్ట్ర ప్రభుత్వం వైద్య, విద్యారంగాలను బలోపేతం చేసేలా రూ.వేల కోట్ల నిధులు వెచ్చిస్తోందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ వెల్లడించారు. చింతకాని మండలంలో శనివారం పర్యటించిన మంత్రి రూ.80 లక్షల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. మండలంలోని పాతర్లపాడు, నేరడ, కొదుమూరు గ్రామాల్లో రూ.60 లక్షల వ్యయంతో నిర్మించిన పల్లె దవాఖానా నూతన భవనాలకు ప్రారంభించగా, గాంధీనగర్ కాలనీ గ్రామంలో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించనున్న గ్రామపంచాయతీ భవనానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కొదుమూరులో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి పువ్వాడ మాట్లాడుతూ ప్రజలందరికీ మెరుగైన వైద్యసేవలు అందించేందుకు పల్లె దవాఖానాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా అభివృద్ధి బీఆర్‌ఎస్ హయాంలో సీఎం కేసీఆర్ నేతృత్వాన సాధ్యమైందని వివరించారు.

పదికి పది స్థానాల్లో గెలిపిద్దాం..

ఉమ్మడి జిల్లా అభివృద్ధికి ముఖ్యమంత్రి కేసీఆర్ రూ.వేల కోట్లు విడుదల చేస్తున్న నేపథ్యాన రానున్న ఎన్నికల్లో పదికి పది స్థానాల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించి కేసీఆర్‌కు కానుకగా ఇవ్వాలని కోరారు. ఈ విషయంలో కార్యకర్తలు ఇప్పటినుంచే చిత్తశుద్ధి పనిచేయాలని సూచించారు. కాగా, రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ హ్యాట్రిక్ విజయాన్ని సాధించడం ఖాయమని మంత్రి పువ్వాడ ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మధిర నియోజకవర్గ ఎన్నికల కోఆర్డినేటర్‌గా రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్‌గా కొండబాల కోటేశ్వరరావును నియమిస్తున్నట్లు మంత్ర ప్రకటించారు. అలాగే, పాతర్లపాడులో పల్లె దవాఖానా నిర్మాణానికి స్థలం అందజేసిన కేసరాజు రామచంద్రరావును సన్మానించారు. ఈ కార్యక్రమాల్లో కలెక్టర్ వీ.పీ.గౌతమ్, జెడ్పీ చైర్మన్ లింగాల కమలరాజ్, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, డీఎంహెచ్‌ఓ మాలతి, పంచాయతీరాజ్ ఈఈ శ్రీనివాసరావు, డీఎల్‌పీఓ పుల్లారావు, సర్పంచ్‌లు కాలంగి లలిత, కాంద్ర పిచ్చయ్య, గొర్రెముచ్చు ఈశ్వరమ్మ, నక్కనబోయిన సుజాత, జెడ్పీటీసీ పర్చగాని తిరుపతి కిషోర్, ఎంపీపీ కోపూరి పూర్ణయ్యతో పాటు గురిజాల హన్మంతరావు, పెంట్యాల పుల్లయ్య పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటరు జాబితా

- తయారీపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి
- జిల్లా ఎలక్టోరల్ అబ్జర్వర్ బాలమాయాదేవి



మాట్లాడుతున్న ఎలక్టోరల్ అబ్జర్వర్ బాలమాయాదేవి, పక్కన కలెక్టర్ గౌతమ్ అధికారులు

ఖమ్మం సహకారనగర్: ఓటరు జాబితాను వంద శాతం పారదర్శకంగా సిద్ధం చేయడంపై అధికారులు దృష్టి సారించాలని జిల్లా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ బి.బాల మాయాదేవి సూచించారు. కలెక్టరేట్‌లో శనివారం ఆమె ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా మాట్లాడుతూ 18ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. మార్పులు, చేర్పుల కోసం దరఖాస్తులు స్వీకరించి క్షుణ్ణంగా పరిశీలించాలని తెలిపారు. అనంతరం కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ జిల్లాలో 64 కేంద్రాల మార్పు, 36 కేంద్రాల మార్పిడితో పాటు 16 కొత్త కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదించినట్లు తెలిపారు. అలాగే, నూతన ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులకు వచ్చిన దరఖాస్తుల వివరాలు వెల్లడించారు. అనంతరం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఈవీఎం అవగాహన కేంద్రం, సోలార్ షెడ్‌ను బాలమాయాదేవి పరిశీలించారు. ఈసమావేశం అనంతరం కలెక్టర్ గౌతమ్ అధికారులతో సమావేశమై ఓటర్ల జాబితా స్పెషల్ సమ్మరీ రివిజన్‌పై సమీక్షించారు. ఇంటింటి తనిఖీల్లో వేగం పెంచాలని, పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలని సూచించారు. అదనపు కలెక్టర్లు సత్యప్రసాద్, మధుసూదన్ నాయక్, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, ఆర్డీఓలు జి.గణేష్, అశోక్‌చక్రవర్తి, ఎస్‌డీసీ రాజేశ్వరి, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ రాంబాబు పాల్గొన్నారు.

సాక్షి, స్తంభాద్రి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో...
నేడు మట్టి గణపతి విగ్రహాల పంపిణీ



ఖమ్మంగాంధీచౌక్: పర్యావరణ పరిరక్షణలో భాగంగా వినాయకచవితి సందర్భంగా 'సాక్షి' మీడియా గ్రూప్, స్తంభాద్రి ఉత్సవ సమితి సంయుక్త ఆధ్వర్యాన మట్టితో చేసిన వినాయక విగ్రహాల పంపిణీ చేయనున్నారు. ఖమ్మంలోని పెవిలియన్ మైదానం ఎదురుగా ఆదివారం సాయంత్రం 4 గంటలకు విగ్రహాల పంపిణీని ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ, కమిషనర్ ఆదర్శ్ సురభి ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమంలో స్తంభాద్రి ఉత్సవ సమితి అధ్యక్ష, కార్యదర్శులు వినోద్ లాహోటి, కీసర జయపాల్‌రెడ్డి తదితరులు పాల్గొంటారు. 'మట్టి వినాయకులను పూజిద్దాం.. పర్యావరణాన్ని రక్షిద్దాం' నినాదంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు.



ఉద్యమాల పురిటిగడ్డ.. ఖమ్మం

భూమి, భుక్తి సాధించడమే కాక వెట్టిచాకిరీ విముక్తి కోసం పోరాడిన నేల ఇది! తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో జిల్లా వాసులు అనేక మంది కీలకపాత్ర పోషించగా, ప్రాణాలు సైతం అర్పించారు. పెత్తందారులు, జాగీర్దార్లు, దేశ్‌ముఖ్‌లు, భూస్వాములే కాక నిజాం సైన్యాలకు ఎదురొడ్డి పోరాడారు. ఈ క్రమంలో పలువురు అమరులైనా వెన్ను చూపలేదు. వీరి త్యాగాలకు గుర్తుగా అనేక గ్రామాల్లో అమరుల స్తూపాలు కనిపిస్తాయి. తెలంగాణ ప్రాంతం భారత్‌లో విలీనమయ్యాక ఇక్కడి ప్రజలు స్వేచ్ఛా వాయువులు పీల్చుకున్నారు. అయితే, సెప్టెంబర్ 17న పార్టీల వారీగా వివిధ పేర్లతో కార్యక్రమాలు నిర్వహిస్తుండగా.. ఆనాటి ఘటనలను వృద్ధులు గుర్తు చేసుకుంటున్నారు.

- తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో కీలకపాత్ర
- దొరల పెత్తందారీ ఆగడాలకు అడ్డుకట్ట
- పేదలకు లక్షల ఎకరాల భూపంపిణీ
- నేటికీ స్థూపాల రూపంలో అమరుల త్యాగాలు

పోరాటంలో పిండిప్రోలు

తిరుమలాయపాలెం : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో తిరుమలాయపాలెం మండలంలోని పిండిప్రోలు కీలకపాత్ర పోషించింది. పుచ్చలపల్లి సుందరయ్య, మంచికంటి రాంకిషన్‌రావు, దేవులపల్లి వెంకటేశ్వరరావు, చంద్ర రాజేశ్వరరావు, భీంరెడ్డి నర్సింహారెడ్డి, మల్లు స్వరాజ్యం, రాయల వెంకటనారాయణ వంటి నేతలెందరో ఇక్కడే అనేక సమావేశాలు నిర్వహించి పోరాటాలకు రూపకల్పన చేశారు. దున్నే వాడిదే భూమి అనే నినాదంతో లక్షలాది ఎకరాలను పేదలకు పంచారు. ఈ గ్రామానికి చెందిన రాయల వెంకటనారాయణ దళ కమాండర్‌గా పనిచేయగా... పులి రామయ్య, రాయల జగ్గయ్య, రాంబాయమ్మ, పద్మనాభుల పుల్లయ్య, దొడ్డా జానకి రామయ్య, దొండేటి నారయ్య, కమ్మకోమటి రంగయ్య, కమ్మకోమటి వీరయ్య, దొడ్డా సీతారాములు, పప్పుల భద్రయ్య తదితరులు తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొని అమరులయ్యారు. అమరుల త్యాగాలకు గుర్తుగా స్థూపం నిర్మించగా, రాయల వెంకటనారాయణ, పద్మనాభుల పుల్లయ్య పేరిట స్మారక భవనాలు కూడా ఏర్పాటయ్యాయి.



పిండిప్రోలులో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుల స్మారక స్తూపం


పోరాట స్ఫూర్తిని మరువలేం



ఆనాటి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తిని మరువలేం. నేను ప్రత్యక్షంగా సాయుధ పోరాటంలో పాల్గొన్నా.. పోరాట యోధులకు విప్లవ సాహిత్యం, ఆహారం అందించాం. పోలీసుల ఆగడాలు భరించలేక అడవుల్లో గడిపాం. ఊళ్లకు ఊళ్ల ప్రజలను పోలీసులు చిత్రహింసలకు గురిచేసేవారు. పోరాటయోధుల త్యాగాలను నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలి.

– తాతా వెంకటకృష్ణమయ్య, పిండిప్రోలు

గడీల కూల్చివేతలో పాల్గొన్నాం..



వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా పోరాటయోధులు ఇచ్చిన పిలుపుతో దొరల గడీలు బద్దలు కొట్టే కార్యక్రమంలో పాల్గొన్నాను. దళ నాయకులకు సాహిత్యం, ఆహారం అందించడమే కాక కొరియర్లుగా పనిచేశా. మాపై నిర్బంధం విధిస్తే అడవుల్లో గడిపేవాళ్లం. ఎందరో గొప్ప నేతలు పేద ప్రజల వెట్టి చాకిరీ విముక్తి కోసం పోరాడి ప్రాణత్యాగాలు చేశారు.

– దొండేటి రామయ్య, సాయుధ పోరాట యోధుడు

ఒకే చితిపై ఏడుగురి దహనం



గోవిందాపురంలో ఏడుగురిని దహనం చేసిన చోట నిర్మించిన స్తూపం

బోనకల్: కట్టుబానిసల్లా పని చేయించుకుని పట్టెడన్నం కూడా పెట్టని నైజాం నవాబులు, భూస్వాములను తుపాకీ పట్టి తరిమికొట్టిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధులకు బోనకల్ పురిటిగడ్డగా నిలుస్తుంది. బోనకల్ మండలం చిరునోములకు చెందిన రావెళ్ల జానకీరామయ్య ఆంధ్ర మహాసభ జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు. ఆయన నాయకత్వంలో గోవిందాపురం, లక్ష్మీపురం, తూటికుంట్ల, ముష్టికుంట్ల, పెద్దబీరవల్లి, సీతానగరం, రాయన్నపేటకు చెందిన పలువురు పోరాటంలో పాల్గొన్నారు. లక్ష్మీపురానికి చెందిన మల్లెల వెంకటేశ్వర్లును దళ కమాండర్‌గా, గోవిందాపురానికి చెందిన తమ్మారపు గోవింద్, చుండూరు నర్సింహారావు, జొన్నలగడ్డ రామయ్యను ప్రజానాయకులుగా నియమించుకుని యువకులకు శిక్షణ ఇస్తూ పోరాడారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని అంతమొందించేందుకు నైజాం నవాబు, రజాకార్లు ఉద్యమకారులపై దాడులు చేసినా పోరాటం ఆపలేదు. దీంతో యోధుల సమాచారం చెప్పాలని ఆళ్లపాడుకు చెందిన యలమందల చంద్రయ్య, మందా అచ్చయ్య, వల్లాపురానికి చెందిన గొర్రెముచ్చుల హజరయ్య, మద్ది రాములు, మడుపల్లి వీరస్వామి, సామినేని గోపయ్య, రేపల్లెవాడకు చెందిన తమ్మినేని బుచ్చయ్యను రేపల్లెవాడ శివార్లలో కాల్చిచంపారు. ఆ తర్వాత గోవిందాపురం ఊరిబయట మంగలి గుట్టపై ఒకే చితిపై దహనం చేశారు. అయినా యోధులు పోరాడి స్వాతంత్ర్యం సాధించుకోగా.. వారి త్యాగాలను స్థానికులు గుర్తుచేసుకుంటారు.

సార్జెంట్ కాల్పుల్లో ప్రాణార్పణం

ఎర్రుపాలెం: తెలంగాణ సాయుధ పోరాటంలో ఎర్రుపాలెం మండలం మీనవోలు చరిత్ర పుటల్లో నిలుస్తుంది. ఎర్రుపాలెంలో నైజాం పోలీస్ క్యాంపు నిర్వహించేవారు. క్యాంపు ఇన్‌చార్జ్‌గా బ్రిటీష్ అధికారి లెఫ్టినెంట్ సార్జంట్ తరచూ మీనవోలుపై దాడిచేసి ప్రజల సొమ్ము అపహరించేవాడు. మరోవైపు రజాకార్లు కూడా ఈ ప్రాంత ప్రజలను చిత్రహింసలకు గురిచేసేవారు. ఈ ఆగడాలు, అరాచకాలను తట్టుకోలేక గ్రామస్తులందరూ ఎదురుతిరగాలని నిర్ణయించుకున్నారు. 1948 జనవరి 15న సార్జంట్ తన సైన్యంతో పాటు రజాకార్లతో కలిసి వచ్చే క్రమాన గ్రామస్తులు ఈటెలతో తిరగబడ్డారు. ఇది ఊహించని సార్జంట్ తుపాకీతో కాల్పులు జరపడంతో రాంపల్లి రామయ్య, సుఖబోగి ముత్తయ్య, తోట బాలయ్య, పిల్లి కాటయ్య, బండి వీరయ్య, మెట్టెల శ్రీరాములు, తోట వెంకయ్య ప్రాణాలు కోల్పోయారు. ఆతర్వాత రజాకార్లను రైలులో రప్పించి పలువురి ఇళ్లను తగలబెట్టించగా... పలువురు గ్రామస్తులు మీనవోలును విడిచి వెళ్లిపోయారు. అనంతరం పరిస్థితులు చక్కబడ్డాక వచ్చేశారు. కాగా, అమరవీరులకు గుర్తుగా గ్రామస్తులు 1958 సెప్టెంబర్ 15న స్తూపాన్ని నిర్మించగా.. శిథిలం కావడంతో మరమ్మతులు చేయించారు. అలాగే, అదే తరహా మరో స్తూపాన్ని ప్రధాన రహదారిపై నిర్మించారు.



మీనవోలులో నిర్మించిన అమరవీరుల స్తూపం

క్లుప్తంగా

బందోబస్తు మధ్య ఈవీఎంలను భద్రపర్చాలి



గోదాంలో పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ సత్యప్రసాద్

వైరా: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యాన నియోజకవర్గ కేంద్రాలకు చేరవేసే ఈవీఎంలను పటిష్ట బందోబస్తు మధ్య భద్రపర్చాలని అదనపు కలెక్టర్ సత్యప్రసాద్ సూచించారు. వైరాలోని మార్కెట్ యార్డు గోదాములను ఆయన శనివారం తనిఖీ చేశారు. తహసీల్దార్ శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

నెలాఖరులోగా పూర్తి చేయండి

ఖమ్మంసహకారనగర్: జిల్లాలోని రేషన్ కార్డుదారుల ఈకేవైసీని ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ డి.మధుసూదన్‌నాయక్ సూచించారు. డీలర్ల సంఘం బాధ్యులతో శనివారం సమావేశమైన ఆయన సూచనలు చేశారు. జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి జి.శ్రీలత, డీలర్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వెంకన్న, జానీమియా పాల్గొన్నారు.

హామీలు నమ్మే పరిస్థితి లేదు..

నేలకొండపల్లి: ఇప్పటికే అనేక హామీలను విస్మరించిన.. బీఆర్ఎస్ ప్రభుత్వం మళ్లీ ఇచ్చే హామీలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని ఆరోపిస్తూ పైనంపల్లిలో శనివారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, నాయకులు నున్నా రవికుమార్, చావా కిరణ్, రవిరాథోడ్, ఉపేందర్, మన్నె కృష్ణారావు, పాగర్తి సుధాకర్, సూరేపల్లి జ్ఞానరత్నం, హనుమంతరావు, మోహినుద్దీన్, షర్ఫుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

‘విజయభేరి’కి తరలిరండి

ఖమ్మంసహకారనగర్: హైదరాబాద్‌లోని తుక్కుగూడలో ఆదివారం జరిగే విజయభేరి సభకు జిల్లా నుంచి పార్టీశ్రేణులు భారీగా తరలిరావాలని డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ కోరారు. ఖమ్మంలోని పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, పార్టీ నగర అధ్యక్షుడు మహ్మద్ జావీద్‌తో కలిసి శనివారం ఆయన మాట్లాడారు. నాయకులు నాగండ్ల దీపక్‌చౌదరి, మాలోతు రాందాస్, దొబ్బల సౌజన్య, మొక్కా శేఖర్‌గౌడ్, చోటా బాబా పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగింపు

వైరా: వైరా రిజర్వాయర్‌కు వెళ్లే ప్రధాన రహదారి వెంట ఉన్న ఆక్రమణలను శనివారం మున్సిపల్, రెవెన్యూ అధికాలు తొలగించారు. రహదారి విస్తరించి అభివృద్ధి చేసేందుకు అధికారులు రంగంలోకి దిగగా, రాజకీయ ఒత్తిళ్ల కారణంగా పనులు ఆలస్యమవుతూ వస్తున్నాయి. ఈమేరకు రిజర్వాయర్ కుడికాల్వ నుండి ప్రధాన రహదారి వరకు ఇరువైపులా ఆక్రమణలను తొలగించేందుకుక అధికారులు రంగంలోకి దిగారు. అయితే, అఖిలపక్షం నాయకులు రహదారి 65 అడుగుల మేర విస్తరించాలని డిమాండ్ చేస్తుండగా, అధికారులు స్పష్టత ఇవ్వకున్నా పనులు మొదలుపెట్టారు.

జెమిని వైరస్‌తో జాగ్రత్త

ఏన్కూరు: మిరప తోటలకు జెమిని వైరస్ సోకే అవకాశమున్నందున రైతులు అప్రమత్తంగా వ్యవహరించాలని వైరా కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ చైతన్య, డాక్టర్ జెస్సీ సూచించారు. ఏన్కూరు మండలం రేపల్లెవాడలో మిరప తోటలను శనివారం వారు పరిశీలించి సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో వ్యవసాయాధికారి నర్సింహారావు పాల్గొన్నారు.

టీకాలు వేయించాలి

ఏన్కూరు: మిషన్ ఇంద్రధనుష్ కార్యక్రమంలో ఈ నెల 11 నుంచి 16 వరకు చిన్నారులందరికీ టీకాలు వేయించాలని జిల్లా వ్యాక్సిన్ మేనేజర్ సీహెచ్.రమణ సూచించారు. మండలంలోని కేసుపల్లి, ఏన్కూరు గ్రామాల్లో శనివారం పర్యటించిన ఆయన ఇంటింటికీ తిరిగి చిన్నారులు, గర్భిణుల వ్యాక్సినేషన్‌ను పరిశీలించారు.బాలింతలు, గర్భిణులు క్రమం తప్పకుండా టీకాలు వేయించుకోవాలని, ఇందుకోసం సిబ్బంది కృషి చేయాలని సూచించారు. వైద్యులు రాములు, మోనిక, సీహెచ్ఓ శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

వేంసూరు: ప్రతిఒక్కరూ ఇళ్లలోనే కాక పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే అనారోగ్యం దరిచేరదని జెడ్పీ సీఈఓ అప్పారావు తెలిపారు. వేంసూరు మండలంలోని పల్లెవాడ, చౌడవరం, చౌడవరంతండా, వేంసూరు, మర్లపాడు, వైఎస్ బంజర్, కల్లూరుగూడెంలో శనివారం పర్యటించిన ఆయన పారిశుద్ధ్య పనులు తనిఖీ చేసి అభివృద్ధి పనులను పరిశీలించారు. డీఎల్పీఓ ప్రభాకర్, ఎంపీడీఓ రమేష్, ఎంపీఓ రంజిత్, వైద్యాధికారి ఇందుప్రియతో పాటు విజయలక్ష్మి, సుస్మిత, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఘర్షణలో గాయాలు

ముదిగొండ: పొలం విషయంలో రెండు వర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకోగా ఆరుగురు గాయపడ్డారు. మండలంలోని గంధసిరికి చెందిన తొండ శ్రీను, తొండ కొండలు కుటుంబాల మధ్య పొలం దారి విషయంలో గొడవలు జరుగుతున్నాయి. శనివారం కూడా కర్రలు, కొడవళ్లతో దాడులు చేసుకోగా రెండు కుటుంబాల్లో ఆరుగురు గాయపడడంతో ఖమ్మంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ నరేశ్ తెలిపారు.

‘మట్టి’ మేలు తలపెట్టాలని..

- పర్యావరణ రక్షణకు మట్టి వినాయక విగ్రహాల విక్రయాలు
- ఉత్సవ కమిటీలకు అందుబాటులో ప్రతిమలు
- పర్యావరణ పరిరక్షణ కోసమేనంటున్న నిర్వాహకులు
- జలాచరాలకు ప్రయోజనం కలిగేలా ‘సీడ్ గణేష్’ కూడా..



విక్రయానికి సిద్ధంగా ఉన్న మట్టి వినాయక విగ్రహాలు

ఖమ్మంగాంధీచౌక్: వినాయక ఉత్సవాల సందర్భంగా ఏటేటా నిర్వాహకులు పర్యావరణానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారు చేసిన వినాయక విగ్రహాలతో ఎదురయ్యే అనర్థాలపై అవగాహన ఉండడంతో ప్రత్యామ్నాయాలపై దృష్టి సారిస్తున్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారుచేసిన విగ్రహాలన నిమజ్జనం చేయడం ద్వారా జలాశయాలు కలుషితమవుతున్నాయి. అలాగే, పర్యావరణం దెబ్బతింటుంది. జలాశయాల్లోని జలచరాల మనుగడ దెబ్బతింటోంది. ఈ నేపథ్యాన మట్టి విగ్రహాల ప్రతిష్ఠాపనకు చొరవ తీసుకుంటున్నారు.

క్రమంగా పైపైకి..

జిల్లాలో ఏటేటా మట్టి విగ్రహాలతో ఉత్సవాలను జరుపుకునే సంస్కృతి పెరుగుతోంది. ఎనిమిదేళ్లుగా జిల్లాలో ప్రచారం చేస్తుండగా.. ఖమ్మం శ్రీ స్తంభాద్రి సేవా సమితి, మరికొన్ని స్వచ్ఛంద సంస్థల ప్రోత్సాహంతో తయారీదారులు మట్టి విగ్రహాలను విక్రయిస్తున్నారు. 2015లో ఎంత ప్రచారం చేసినప్పటికీ కేవలం పది మట్టి విగ్రహాలను మాత్రమే విక్రయించగలిగారు. ఆ తర్వాత నుంచి ఈ సంఖ్య పెరుగుతోంది. ఈ ఏడాది జిల్లావ్యాప్తంగా 1,100 మట్టి విగ్రహాలకు, ఖమ్మంలో 30 విగ్రహాలకు ఆర్డర్లు వచ్చాయంటే పరిస్థితిలో మార్పును అర్థం చేసుకోవచ్చు. భారీ స్థాయిలో మట్టి విగ్రహాలను హైదరాబాద్, సూర్యాపేట, కోల్‌కతాకు చెందిన నిపుణులు తయారు చేసి తీసుకొచ్చి ఇల్లెందు క్రాస్ రోడ్, బైపాస్ రోడ్ కూరగాయల హోల్‌సేల్ మార్కెట్ సమీపాన విక్రయిస్తున్నారు. సైజ్ ఆధారంగా రూ.12 వేల నుంచి రూ.30 వేల వరకు ధర పలుకుతోంది.

విత్తన గణేశ్‌లు..

మట్టితో తయారుచేసిన వినాయక విగ్రహాల్లో కూడా నవ ధాన్యాలను కలుపుతున్నారు. చేపలు, జలచరాలకు ఆహారంగా ఉపయోగపడేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇంకొందరు వేప, ఇతర విత్తనాలు కలుపుతున్నారు. తద్వారా వినాయక చవితి పూర్తయ్యాక అందులోని విత్తనాన్ని ఇంట్లో నాటితే మొక్కలను పెంచినట్లవుతోంది.

ప్రత్యామ్నాయంగా మట్టి విగ్రహాలు



ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలతో అనర్థాలు చోటు చేసుకుంటుండటంతో ప్రత్యామ్నాయంగా మట్టి విగ్రహాలను పర్యావరణ వేత్తలు అందుబాటులోకి తీసుకొస్తున్నారు. ఈ విషయమై పర్యావరణవేత్తలు కొంతకాలంగా విస్తృత ప్రచారం చేస్తున్నారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలతో కలిగే నష్టాలు, మట్టి విగ్రహాలతో కలిగే ప్రయోజనాలను ప్రజల్లోకి తీసుకెళ్తుండగా మంచి ఫలితాలు వస్తున్నాయి. అంతేకాకుండా మట్టి విగ్రగహాలను తయారుచేసి విక్రయించే వారిని సైతం ప్రోత్సహిస్తున్నారు.

ప్రాధాన్యం పెరుగుతోంది..



పలువురు మండప నిర్వాహకులు మట్టి విగ్రహాల కొనుగోలుకు మొగ్గు చూపుతున్నారు. పీఓపీతో చేసే విగ్రహాలతో ఎదురయ్యే సమస్యలపై అవగాహన వచ్చింది. కోల్‌కత్తాలో గంగా నది మట్టి తీసుకొచ్చి చేసే విగ్రహాలను తెలంగాణ అంతటా విక్రయిస్తున్నాం. –దండి దిలీప్‌కుమార్, మట్టి విగ్రహాల తయారీదారుడు

నిర్వాహకులను ప్రోత్సహిస్తున్నాం



మట్టి విగ్రహాల తయారీ, ప్రతిష్ఠాపనను ప్రోత్సహిస్తున్నాం. పీఓపీతో చేసే విగ్రహాల వల్ల ఇబ్బందులు, మట్టి విగ్రహాలతో కలిగే ప్రయోజనాలను వివరిస్తుండగా విగ్రహాల సంఖ్య పెరుగుతోంది. ఖమ్మంలోనూ విగ్రహాలు ఇప్పుడు అందుబాటులోకి వచ్చాయి. – వినోద్ లాహోటీ, స్తంభాద్రి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు

అందుబాటులో విగ్రహాలు



వినాయక ఉత్సవ కమిటీలకు అందుబాటులో ఉండేలా మట్టి విగ్రహాలను తీసుకొచ్చాం. తయారీ యూనిట్ ఖమ్మంలోనే ఏర్పాటు చేయించాం. కోల్‌కత్తా కళాకారులు సూర్యాపేట, హైదరాబాద్‌లో చేసిన విగ్రహాలను తెప్పించి తయారీ ఖర్చుకే విక్రయిస్తున్నాం. –దౌలే సాయికిరణ్, స్తంభాద్రి ఉత్సవ కమిటీ ప్రతినిధి

పర్యావరణ పరిరక్షణకే..



పీఓపీ, ప్లాస్టిక్ పదార్థాలతో విగ్రహాలను నిమజ్జనం చేస్తే చెరువుల్లో నీరు కలుషితమవుతోంది. జీవకోటికి ముప్పు వస్తోంది. అందుకే వాడవాడన జరుపుకునే వినాయక ఉత్సవాల్లో మట్టి విగ్రహాలు వినియోగించాలని ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం. – డాక్టర్ కదవెండి వేణుగోపాల్, పర్యావరణ వేత్త, ఖమ్మం

ఇచ్చిన మాట నిలబెట్టుకున్నా..

- సీతారామ ప్రాజెక్టు పేటెంట్ సీఎం కేసీఆర్‌దే..
- సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య
- రూ.15 కోట్లు పరిహారం చెక్కులు పంపిణీ



ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యను సన్మానిస్తున్న నిర్వాసితులు

సత్తుపల్లి: పోడు భూములకు డబ్బులు రావు.. సీతారామ ప్రాజెక్టు నిర్మాణం పూర్తికాదంటూ రెచ్చగొట్టే ప్రయత్నం చేశారు.. అయినా నాకు ఉన్న శక్తినంతా ఉపయోగించి ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాను... అని సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య వెల్లడించారు. సత్తుపల్లి మండలం బుగ్గపాడులో సీతారామ ప్రాజెక్టు కాల్వ కింద భూమి కోల్పోతున్న 104 మందికి ఎకరం రూ.10.50 లక్షల చొప్పున రూ.15 కోట్ల పరిహారం మంజూరైంది. ఈ సందర్భంగా శనివారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన చెక్కులు అందజేసి మాట్లాడారు. సీతారామ ప్రాజెక్టు రూపకల్పన ఘనత సీఎం కేసీఆర్‌దే తప్ప ఏ నాయకుడిది కాదని చెప్పారు. బుగ్గపాడు గ్రామానికి ఐదేళ్లల్లో రూ.6.40 కోట్లు మంజూరు చేసి అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. కాంగ్రెస్ పార్టీ ఐదు గ్యారెంటీ స్కీంలతో ప్రజలను మభ్యపెట్టేందుకు వస్తోందని.. ఆ పార్టీ పాలిస్తున్న రాష్ట్రాల్లో ఈ పథకాలు ఎందుకు అమలుచేయడం లేదో నేతలను ప్రశ్నించాలని సూచించారు. రైతుల రుణమాఫీకి సంబంధించి ఎదురవుతున్న సాంకేతిక లోపాలను సరిచేయిస్తున్నట్లు సండ్ర తెలిపారు.

పునర్జన్మ ఇచ్చిన సత్తుపల్లి

సీఎం కేసీఆర్ ఆశీస్సులతో మరోసారి సత్తుపల్లి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను ఆశీర్వదించాలని ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య కోరారు. పాలేరు తనకు రాజకీయ జన్మనిస్తే.. సత్తుపల్లి ప్రజలు మూడుసార్లు గెలిపించి పునర్జన్మనిచ్చారని పేర్కొన్నారు. నాయకులంతా ఓ వైపు ఉన్నా, ప్రజలంతా తన వైపు ఉండి గెలిపించారే తప్ప ఎవరి దయాదయాక్షిణ్యాలపై గెలవలేదన్నారు. తొలుత బుగ్గపాడులో నిర్వాసితులు ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యకు కృతజ్ఞతగా భారీ ర్యాలీ నిర్వహించగా శ్రీకనకదుర్గాదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అలాగే, సభలో ఎమ్మెల్యేను నిర్వాసితులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ అశోక్ చక్రవర్తి, సర్పంచ్ కారం జయందర్, సీతారామ ప్రాజెక్టు ఈఈ శ్రీనివాసాచారితో పాటు తుంబూరు శ్రీరాంప్రసాద్, సున్నం నాగమణి, బొడ్డు శివబాబు, కొత్తూరు ఉమామహేశ్వరరావు, కొండపల్లి రమేష్‌రెడ్డి, దొడ్డా శంకర్‌రావు, వనమా వాసు, శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, కూసంపూడి రామారావు పాల్గొన్నారు.

ఏటీఎంల్లో హైటెక్ చోరీ

భద్రాద్రి బ్యాంకు పరిధిలో రూ.79లక్షలు మాయం

ఖమ్మంక్రైం: ఖమ్మం కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న భద్రాద్రి బ్యాంక్ ఏటీఎంల్లో భారీగా నగదు చోరీకి గురైంది. ఉమ్మడి జిల్లాలోని పలు ఏటీఎంల నుంచి దుండుగులు రూ.79లక్షల మేర చోరీ చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఖమ్మం టూటౌన్ ఎస్‌ఐ తోట నాగరాజు శనివారం వెల్లడించిన వివరాలు.. గుర్తుతెలియని ముఠా సభ్యులు భద్రాద్రి బ్యాంకు ఏటీఎంలను లక్ష్యంగా చేసుకుని ఏటీఎం కార్డు పెట్టే స్థానంతో పాటు కీ ప్యాడ్‌పై మైక్రోచిప్‌లు అమర్చారు. తద్వారా నగదు డ్రా కోసం వచ్చే ఖాతాదారుల ఏటీఎం పిన్ నంబర్లు తెలుసుకున్నారు. ఆతర్వాత చోరీకి పాల్పడినట్లు పోలీసులు చేస్తున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. అన్నిచోట్ల కూడా భద్రాద్రి బ్యాంకుల ఏటీఎంల నుంచి రూ.79లక్షల మేర చోరీ జరిగినట్లు ఆలస్యంగా గుర్తించగా, ఖమ్మం టూ టౌన్ ప్రాంతంలోని భద్రాద్రిబ్యాంక్ ఏటీఎంలో అత్యధికంగా రూ.29 లక్షలు చోరీ చేశారు. ఈ మేరకు బ్యాంక్ సీఈఓ సత్యనారాయణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఇతర రాష్ట్రాలకు సంబంధించిన సైబర్ ముఠాగా పోలీసులు నిర్ధారణకు వచ్చినట్లు సమాచారం.

రైతుల ముంగిట్లోకి పశు వైద్యసేవలు

నేలకొండపల్లి: ప్రభుత్వం రైతులకు ఇబ్బంది లేకుండా గోపాలమిత్రల ద్వారా ఇంటి వద్దే పశువులకు వైద్యసేవలు అందిస్తోందని జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ కోర్లకుంట్ల నాగేశ్వరరావు తెలిపారు. మండలంలోని నాచేపల్లిలో శనివారం గోపాలమిత్ర ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన పశు వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులు వ్యవసాయానికే పరిమితం కాకుండా పాడి పశువుల ద్వారా ఆర్థి క స్వావలంబన సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఈఓ కిషోర్, సర్పంచ్ మందడి రాజేష్, ఎంపీటీసీ బాబురావుతో పాటు శంకరయ్య, ఎం.వెంకటేశ్వరరావు, వెంకటప్రసాద్, వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, ఆంజనేయులు, నరసింహారావు, రాము, నాగేశ్వరరావు, తాజ్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఉత్సవాలు జరుపుకోండి..

సమన్వయ సమావేశంలో సీపీ వారియర్



మాట్లాడుతున్న సీపీ విష్ణు ఎస్.వారియర్

ఖమ్మంక్రైం: వినాయక నవరాత్రి ఉత్సవాలతో పాటు నిమజ్జనం ప్రశాంతంగా పూర్తయ్యేలా నిర్వాహకులు సహకరించాలని పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్.వారియర్ సూచించారు. ఈ నెల 18 నుంచి ప్రారంభం కానున్న గణేశ్ ఉత్సవాల సందర్భంగా ఖమ్మం టీఎన్జీవోస్ ఫంక్షన్ హాల్‌లో శనివారం స్తంభాద్రి గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు, నిర్వాహకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో సీపీ మాట్లాడారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. మండపాల ఏర్పాటుకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, డీజే ఏర్పాటుకు అనుమతి లేదనే విషయాన్ని గుర్తించాలని చెప్పారు. అంతేకాక పోలీసులు, కేఎంసీ, అగ్ని మాపకశాఖ, నీటిపారుదల శాఖ, వైద్యశాఖ, విద్యుత్, రవాణా తదితర శాఖల అధికారులకు సహకరిస్తూ ఉత్సవాలను విజయవంతం చేయాలని తెలిపారు. ఎక్కడ రాకపోకలకు ఇబ్బంది లేకుండా మండపాలు ఏర్పాటు చేసుకోవాలని, అనుమతి లేకుండా ప్రైవేట్ స్థలాల్లో విగ్రహాలు ప్రతిష్ఠించొద్దని సూచించారు. కాగా, స్తంభాద్రి ఉత్సవ కమిటీ సభ్యులు పలు సమస్యలను సీపీ దృష్టికి తీసుకెళ్లగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ ప్రసాద్‌రావు, ఏసీపీలు హరికృష్ణ, బస్వారెడ్డి, గణేశ్, సారంగపాణి, మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ మల్లేశ్వరి, స్తంభాద్రి ఉత్సవ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు విద్యాసాగర్, వేల్పుల సుధాకర్, రామారావు, కన్వీనర్ ప్రసన్న, ఆర్గనైజింగ్ కార్యదర్శి అల్లిక అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

పోరాట ఆద్యురాలు చాకలి ఐలమ్మ

- కమ్యూనిస్టులు ముందుండి నడిపించారు..
- చరిత్రను వక్రీకరించేందుకు యత్నిస్తున్న బీజేపీ
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



సభలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వీరభద్రం

ఖమ్మంవన్‌టౌన్: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి ఆద్యురాలు చాకలి ఐలమ్మ అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం వెల్లడించారు. ఖమ్మంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో శనివారం వీర తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవ సభ నిర్వహించారు. ఈ సభలో తమ్మినేని మాట్లాడుతూ నిజాం పాలనలో ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడ్డారని తెలిపారు. దీంతో ప్రపంచంలోనే గొప్ప సాయుధ పోరాటాన్ని నిర్వహించిన కమ్యూనిస్టులు ప్రజలకు విముక్తి కల్పించారన్నారు. జిల్లాలోని పిండిప్రోలు, ఎం వెంకటాయపాలెం, తెల్దారుపల్లి, బొదులబండ, జల్లేపల్లి తదితర ప్రాంతాల్లో సాయుధ దళాలుగా ఏర్పడి పోరాడారని వివరించారు. అయితే, బీజేపీ నేతలు మాత్రం చరిత్రను వక్రీకరించేందుకు ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. తెలంగాణ సాయుధపోరాటంతో అమిత్‌షాకు ఏం సంబంధం ఉంద చెప్పాలన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో నాయకులు పోతినేని సుదర్శన్, ఎర్రా శ్రీకాంత్, బండి రమేష్, బండి పద్మ, సుబ్బారావు, కోటేశ్వరరావు, కళ్యాణం వెంకటేశ్వరరావు, వై.విక్రమ్, సంగబత్తుల నవీన్‌రెడ్డి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అడ్డుకుని తీరుతాం..

కొణిజర్ల: బీజేపీది అసమాన ధర్మమైతే.. కమ్యూనిస్టు పార్టీలది సమధర్మమని.. వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీని ఇండియా కూటమి అడ్డుకుని తీరుతుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పేర్కొన్నారు. కొణిజర్ల మండలం చిన్నగోపతిలో శనివారం జరిగిన సీపీఎం నేత లింగాల భూషణం సంస్మరణ సభలో ఆయన మాట్లాడారు. ఇండియా కూటమి అంటేనే బీజేపీకి వణుకు పుడుతోందన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడగా, నాయకులు బొంతు రాంబాబు, బుర్రి గోపయ్య, బోయినపల్లి శ్రీనివాసరావు, కొప్పుల కృష్ణయ్య, బుగ్గవీటి సరళ, మాదినేని రమేశ్, తాళ్లపల్లి కృష్ణ, మేరుగు సత్యనారాయణ, మండల నాయకులు చెరుకుమల్లి కుటుంబరావు, మేరుగు రమణ, యోహాన్, అన్నారపు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కారు బోల్తా..

వివాహితకు గాయాలు

కూసుమంచి: ఖమ్మం – సూర్యాపేట జాతీయ రహదారిపై శనివారం నాయకన్‌గూడెం వద్ద కారు ప్రమాదవశాత్తు బోల్తా పడగా అందులోని వివాహితకు గాయాలయ్యాయి. కూసుమంచి మండలం ముత్యాలగూడెం గ్రామానికి చెందిన మహిళ (25) కారులో తన భర్త, చిన్నారితో సూర్యాపేట నుంచి స్వగ్రామానికి వస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. ఆమె గాయపడగా ఒడిలో ఉన్న చిన్నారి, కారు నడుపుతున్న భర్త క్షేమంగా బయటపడ్డారు. హైవే సిబ్బంది కారును తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

చోరీ కేసుల్లో నిందితుడిపై పీడీ యాక్ట్

ఖమ్మంక్రైం: జిల్లా కేంద్రంలో ద్విచక్రవాహనాలను చోరీ చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న నిందితుడిపై పీడీ యాక్ట్ నమోదు చేసినట్లు సీపీ విష్ణు ఎస్.వారియర్ తెలిపారు. కూసుమంచి మండలం ఎర్రగడ్డతండాకు చెందిన భూక్యా తిరుపతిపై ఖమ్మం వన్‌టౌన్, టూటౌన్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఆరు చోరీ కేసులు నమోదయ్యాయి. తిరుపతి నుంచి 13 బైక్‌లు రికవరీ చేశారు. గతంలో జైలుశిక్ష అనుభవించినా తనలో మార్పు రాలేదు. మళ్లీ ద్విచక్రవాహనాల చోరీకి పాల్పడుతుండడంతో పీడీ యాక్ట్ నమోదు చేసినట్లు సీపీ తెలిపారు. కాగా, నిందితుడిని టూటౌన్ సీఐ కుమారస్వామి ఆధ్వర్యాన శనివారం చంచల్‌గూడ సెంట్రల్ జైలుకు తరలించినట్లు వెల్లడించారు.

ఐదు నెలల తర్వాత దొరికిన గేదెలు!

పంచుకున్న వారి మధ్య గొడవతో వెలుగులోకి..

నేలకొండపల్లి: ఐదు నెలల కిందట ఐదు గేదెలు మాయమయ్యాయి. సుమారు రూ.4 లక్షల విలువైన గేదెలు కావడంతో రైతు ఊరువాడ తేడా లేకుండా గాలిస్తూనే ఉన్నాడు. అయినా ఫలితం లేకపోయింది. ఇంతలో గేదెలను పంచుకున్న వ్యక్తుల మధ్య గొడవ పోలీసుస్టేషన్‌కు చేరడంతో వారు ఆరా తీయగా అసలు విషయం బయటపడింది. దీంతో పోలీసుస్టేషన్‌కు వెళ్లిన రైతుకు గేదెలను అప్పగించగా ఆనందంతో కన్నీటి పర్యంతమయ్యాడు. వివరాలిలా ఉన్నాయి.. నేలకొండపల్లి మండలంలోని మంగాపురం తండాకు చెందిన రైతు తేజావత్ సైదులుకు సంబంధించి ఐదు గేదెలు ఐదు నెలల కిందట కానరాకుండా పోయాయి. ఎక్కడ వెతికినా ఫలితం లేకుండా పోయింది. అయినా రైతు గాలిస్తూనే ఉన్నాడు. చివరకు సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలం రాజునాయక్ తండాకు గేదెలు చేరగా, రైతులు పంచుకుని పోషిస్తున్నారు. గేదెల పంపకంపై గొడవ రావడంతో విషయం అక్కడి పోలీసులకు చేరింది. దీంతో గేదెలకు ఉన్న ట్యాగ్‌లను పరిశీలించటంతో అసలు రైతు వివరాలు తెలిశాయి. ఆ వెంటనే మంగాపురం తండా సర్పంచ్ భూక్యా సుధాకర్‌కు సమాచారం ఇవ్వగా ఆయన స్థానికులు, రైతుతో కలిసి శనివారం తిరుమలగిరి వెళ్లగా గేదెలను అప్పగించారు. ఐదు నెలల తర్వాత గేదెలను చూసిన రైతు సైదులు కన్నీటి పర్యంతమయ్యాడు. అయితే, గేదెలను దొంగిలించారా లేక స్థానికులే ఎవరైనా వదిలేశారా అనే విషయం తెలియాల్సి ఉంది.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

తిరుమలాయపాలెం: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటనపై శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని పిండిప్రోలుకు చెందిన రొయ్యల కోటయ్య (51) ఈ నెల 11న రాత్రి సమయంలో గేదెను తీసుకుని పొలం నుంచి ఇంటికి వస్తున్నాడు. పిండిప్రోలు సమీపంలోకి రాగానే ఖమ్మం నుంచి మరిపెడ వైపు వెళ్తున్న బొలేరో వాహనం అతివేగంగా వెళ్లి ఢీ కొట్టింది. ఈ దుర్ఘటనలో కోటయ్యతో పాటు గేదెకు తీవ్ర గాయాలు కాగా కోటయ్యను ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. మృతుడికి భార్య సుగుణమ్మ, కుమార్తె సరిత ఉన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా...

తండ్రి మందలించాడని కొడుకు ఆత్మహత్య


భార్గవ్ ప్రసాద్

వట్‌పల్లి(అందోల్): పాఠశాలకు వెళ్లకుండా ఇంటి వద్దే ఉంటున్న కుమారుడిని తండ్రి మందలించగా మనస్తాపం చెందిన ఆ కొడుకు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన సంగారెడ్డి జిల్లాలో శనివారం వెలుగులోకి వచ్చింది. అందోల్ మండలం అక్సాన్‌పల్లి గ్రామానికి చెందిన జంబుల భార్గవ్ ప్రసాద్ (14) పుల్కల్ మండలంలోని సింగూర్ రెసిడెన్షియల్ స్కూల్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. 20 రోజుల క్రితం హాస్టల్‌లో భోజనం బాగోలేదని ఇంటికొచ్చాడు. తిరిగి వెళ్లకపోవడంతో ఈనెల 11న తండ్రి జంబులకుమార్ కుమారుడిని మందలించగా అదేరోజు ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఇటు స్కూల్‌కు వెళ్లలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబసభ్యులు బంధువు లు, స్నేహితుల వద్ద వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. ఈనెల 12న జోగిపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా, కుమార్ ఇంటి వెనుక ముళ్ల పొదల్లో నుంచి దుర్వాసన రావడంతో గ్రామస్తులు అక్కడికి వెళ్లి పరిశీలించగా ప్రసాద్ చెట్టుకు ఉరి వేసుకుని కనిపించాడు. కాగా, మృతదేహం కుళ్లిపోయి ఉండటాన్ని గమనించారు. పోలీసులకు, కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు ప్రసాద్ మృతదేహాన్ని కిందికి దించి పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

యువకుడి వేధింపులతో బాలిక ఆత్మహత్య

- ప్రేమించాలంటూ వెంట పడటంతో ఆవేదన
- ఖమ్మం జిల్లాలో ఘటన

కారేపల్లి (ఖమ్మంజిల్లా) : ప్రేమించాలంటూ ఓ యువకుడు వెంటబడి వేధిస్తుండటంతో తట్టుకోలేక బాలిక భయపడి ఆత్మహత్య చేసుకుంది. ఖమ్మం జిల్లా ఏన్కూరు మండలం రాజలింగాలకు చెందిన మేకల నవీన్, కారేపల్లి మండలం చీమలపాడుకు చెందిన ఓ బాలిక వెంట పడుతున్నాడు. తనను ప్రేమించాలంటూ వేధిస్తుండటంతో ఆమె తల్లిదండ్రులకు చెప్పగా యువకు డిని మందలించి వదిలేశారు. అయినా తీరు మార్చుకోని ఆ యువకుడు శుక్రవారం సాయంత్రం బాలిక తల్లిదండ్రులు లేని సమయం చూసి ఇంట్లోకి చొరబడి తనను ప్రేమించాల్సిందేనని బెదిరించడంతో భయపడిన బాలిక ఇంట్లోనే పురుగుమందు తాగింది. స్థానికులు ఇల్లెందు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బాలిక శనివారం మృతి చెందింది. ఘటనపై బాలిక తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు కారేపల్లి ఎస్‌ఐ తెలిపారు.

అరబిక్ క్లాసుల ముసుగులో

ఉగ్ర పాఠాలు!

చెన్నైకు చెందిన ఐసిస్ ఉగ్రవాది వ్యవహారమిది

- కొన్నాళ్లు హైదరాబాద్‌లోనూ నివాసం
- ఇటీవలే విదేశాలకు పారిపోయిన ఆ కీలక సూత్రధారి
- దర్యాప్తులో గుర్తించిన జాతీయ దర్యాప్తు సంస్థ అధికారులు
- నగరంలోని సానుభూతిపరుల ఇళ్లలో ముమ్మర సోదాలు
- పలు పుస్తకాలతో పాటు డిజిటల్ పరికరాలు స్వాధీనం



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ–తమిళనాడుల్లో ఉన్న కొన్ని కేంద్రాలు అరబిక్ క్లాసుల ముసుగులో ఉగ్రవాద పాఠాలు బోధిస్తూ, యువతను ఐసిస్ వైపు ఆకర్షిస్తున్నాయా? ఔననే అంటున్నాయి జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఏ) వర్గాలు. ఇలా ప్రేరేపించిన నేపథ్యంలోనే 2022 అక్టోబర్ 23 కోయంబత్తూరులోని సంగమేశ్వర దేవాలయం వద్ద కారు బాంబు పేలుడు జరిగిందని స్పష్టం చేస్తోంది. దీనికి సంబంధించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న చెన్నై ఎన్‌ఐఏ యూనిట్ శనివారం హైదరాబాద్‌లోని ఐదు ప్రాంతాల్లో సోదాలు చేసింది. హైదరాబాద్–తమిళనాడుల్లో మొత్తం 31 చోట్ల తనిఖీలు చేసినట్లు అధికారులు ప్రకటించారు. ఈ సోదాల్లో ఉగ్రవాద సంబంధిత పుస్తకాలు, పత్రాలతో పాటు ఫోన్లు, ల్యాప్‌టాప్స్, హార్డ్ డిస్క్‌లు వంటి డిజిటల్ పరికరాలు, రూ.60 లక్షల నగదు, 18,200 అమెరికన్ డాలర్లు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఈ పుస్తకాలు, పత్రాలు అరబిక్‌తో పాటు తెలుగు, తమిళం భాషల్లో ఉన్నట్లు అధికారులు వివరించారు. యువతను ఐఎస్‌ఐఎస్ వైపు ఆకర్షించడానికి కొందరు ఉగ్రవాదులు ప్రాంతాల వారీగా అధ్యయన కేంద్రాలు, అరబిక్ బోధన కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఎన్‌ఐఏ గుర్తించింది. వాట్సాప్, టెలిగ్రామ్‌లో ఏర్పాటు చేసిన గ్రూపుల ద్వారా తమ భావజాలాన్ని ఐసిస్ విస్తరిస్తోందని ఎన్‌ఐఏ గుర్తించింది. చెన్నైకి చెందిన ఉగ్రవాది ఈ వ్యవహారాల్లో కీలకంగా వ్యవహరించారు. కొన్ని రోజులపాటు హైదరాబాద్‌లోనూ నివసించిన ఇతగాడు అల్ ఫుర్ఖాన్ పేరుతో ఓ పబ్లికేషన్స్ నిర్వహించాడు. ఇందులో తెలుగు, తమిళం, అరబిక్ భాషల్లో ఉగ్రవాద సాహిత్యం, భావజాలాన్ని వ్యాప్తి చేసే మెటీరియల్ ముద్రించాడు. ఐసిస్ మీడియా వింగ్ పేరు కూడా అల్ ఫుర్ఖానే కావడం గమనార్హం. ఇతగాడు ఇటీవలే విదేశాలకు పారిపోయాడని నిఘా వర్గాలు గుర్తించాయి.

ఐదుగురి ఇళ్లపై ఏకకాలంలో దాడులు..

ఈ చెన్నై వాసి నగరంలో నివసించిన కాలంలో సైదాబాద్ పరిధిలోని సపోటాబాద్‌కు చెందిన హసన్, రాజేంద్రనగర్ పరిధిలోని అత్తాపూర్‌కు చెందిన అమీర్, యూసుఫ్‌గూడ, బోరబండ ప్రాంతాలకు చెందిన నూరుల్లా, జాహెద్‌లతో పాటు గోల్కొండ పరిధిలోని షేక్‌పేటకు చెందిన జబ్బార్‌తో సన్నిహితంగా మెలిగాడు. వీరితో పాటు మరికొందరు ఉగ్రవాద సానుభూతిపరులతో సోషల్ మీడియా గ్రూపులు నిర్వహించాడు. తాను ముద్రించిన పుస్తకాలను అందించడంతో పాటు వివిధ అంశాలకు సంబంధించిన సాఫ్ట్‌కాపీలను షేర్ చేశాడు. కోయంబత్తూరు బాంబు పేలుడు కేసులో కీలక నిందితుడిగా ఉన్న కేరళ వాసి మహ్మద్ అజారుద్దీన్‌ను ఈనెల 1న ఎన్‌ఐఏ అరెస్టు చేసింది. ఇతడి నుంచీ ఎన్‌ఐఏ అధికారులు అల్ ఫుర్ఖాన్ ద్వారా ముద్రితమైన సాహిత్యం, పుస్తకాలు స్వాధీనం చేసుకున్నారు. ఆ పుస్తకాలపై హైదరాబాద్‌లో ముద్రితమైనట్లు చిరునామా ఉంది. దీంతో పాటు సాంకేతిక ఆధారాలను బట్టి నగరానికి చెందిన ఐదుగురి వ్యవహారం ఎన్‌ఐఏ దృష్టికి వెళ్ళింది. దీంతో శనివారం నగరానికి చేరుకున్న ఎన్‌ఐఏ చెన్నై యూనిట్‌కు చెందిన ప్రత్యేక బృందం ఐదుగురి ఇళ్లపై ఏకకాలంలో దాడి చేసి సోదాలు నిర్వహించింది. అల్ ఫుర్ఖాన్ పబ్లిషర్స్ ద్వారా ముద్రితమైన పుస్తకాలు, ఇతర పత్రాలతో పాటు సెల్‌ఫోన్లు, హార్డ్‌డిస్క్‌లు స్వాధీనం చేసుకున్నారు. హసన్, అమీర్, నూరుల్లా, జాహెద్, జబ్బార్‌లకు సీఆర్పీసీ 41–ఏ కింద నోటీసులు జారీ చేశారు.

కన్నబిడ్డలనే కాల్వలోకి తోసి...

- కల్లు తాగొద్దని భర్త మందలించాడని.. ఓ తల్లి ఘాతుకం
- ముగ్గురు కుమార్తెల మృతి.. దొరకని కుమారుని ఆచూకీ


మహాలక్ష్మి, సాత్విక, మార్కండేయ, మంజుల


తల్లి లలిత

బిజినేపల్లి: కల్లు తాగొద్దని భర్త హెచ్చరించాడన్న కోపంతో ఓ తల్లి ముక్కుపచ్చలారని తన నలుగురు చిన్నారులను కాల్వలో విసిరేసింది. ఈ ఉదంతం శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని ఎర్రకుంటతండాలో చోటుచేసుకుంది. మండలంలోని లట్టుపల్లి పంచాయతీ పరిధిలోని ఎర్రకుంట తండాకు చెందిన లలిత మంగనూర్‌కు చెందిన శరబందను ఎనిమిదేళ్ల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకుంది. వీరికి కూతుళ్లు మహాలక్ష్మి (7), సాత్విక (5), మంజుల (3)తోపాటు 7 నెలల కుమారుడు ఉన్నారు. ఈ క్రమంలో లలిత కొన్నాళ్లుగా మందు కల్లును తాగుతుండటంతో పలుమార్లు భర్త శరబంద మందలించాడు. దీంతో భర్త తరచూ మందలిస్తున్నాడని లలిత శనివారం బిజినేపల్లి పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని వేధిస్తున్నాడని ఫిర్యాదు చేసింది. పోలీసులు శరబందను స్టేషన్‌కు రావాలని ఫోన్ చేసి పిలిచారు. మధ్యాహ్నం కావడంతో పిల్లలకు ఏమైనా తినిపించుకు వస్తానని చెప్పి వెళ్లిన లలిత.. పోలీస్‌స్టేషన్ సమీపంలోని కేఎల్‌ఐ కాల్వలోకి చిన్నారులతో కలిసి దిగింది. అటుగా వెళ్తున్న కొందరు ఆమెను గమనిస్తుండగానే నలుగురు చిన్నారులను కాల్వలోకి విసిరేసింది. వెంటనే వారు బిజినేపల్లి పోలీసులకు ఫోన్ చేసి సమాచారం అందించి కాల్వలోకి దిగారు. పోలీసులు సైతం కాల్వ వద్దకు వచ్చి గాలించగా.. నీటి ఉధృతికి చిన్నారులు కిలోమీటరు మేర కొట్టుకుపోయారు. చివరికి ముగ్గురు కుమార్తెల మృతదేహాలు లభించగా.. బాలుడు మార్కండేయ ఆచూకీ లభించలేదు. అప్పటికే పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. చిన్నారులను కాల్వలో విసిరేసిన తల్లిపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న భర్త శరబంద సైతం పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నాడు. చిన్నారుల మృతదేహాలను పోలీసులు జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

30 మంది విద్యార్థినులకు అస్వస్థత

- అల్పాహారం తిని వాంతులు చేసుకున్న బాలికలు
- పులిహోరలో పురుగులు వచ్చాయని వెల్లడి
- మంచాల బీసీ బాలికల వసతి గృహంలో ఘటన


మంచాల ఆస్పత్రిలో విద్యార్థినులు

మంచాల: హాస్టల్‌లో వడ్డించిన అల్పాహారం తిని 30 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. రంగారెడ్డి జిల్లా మంచాల మండల కేంద్రంలో ఈ ఘటన జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.. బీసీ బాలికల వసతి గృహంలో మొత్తం 94 మంది విద్యార్థినులు ఉన్నారు. శనివారం ఉదయం వీరికి అల్పాహారంగా పులిహోర పెట్టారు. అందులో పురుగులు వచ్చాయని విద్యార్థినులు చెబుతున్నారు. అల్పాహారం తిన్నవారిలో ఒకరి తర్వాత ఒకరు తలనొప్పి, కడుపు నొప్పి సమస్యలతో ఇబ్బంది పడ్డారు. పదుల సంఖ్యలో పిల్లలు అస్వస్థతకు గురికావడంతో వారిని స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. గంట వ్యవధిలోనే 30 మందికి పైగా విద్యార్థినులు వాంతులు చేసుకుని, కాళ్లు, చేతులు లాగుతున్నాయని వాపోయారు. వారికి ఆస్పత్రి వైద్యుడు శ్రావణ్ కుమార్‌రెడ్డి చికిత్స చేశారు. కాగా, తీవ్ర అస్వస్థతకు గురైన కె.అనిత (7వ తరగతి), కె.అఖిల (8), వి.వైష్ణవి (5), ఎం.శిరీష (5), పి.అక్షర (3), ఎం.పూజ (7), ఆర్.త్రిష (10), ఎం.శ్రీనిధి (4వ తరగతి)ని మెరుగైన వైద్యం కోసం ఇబ్రహీంపట్నంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం ఇందులో నలుగురిని వనస్థలిపురంలోని ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. విద్యార్థుల విషయంలో వార్డెన్‌తో పాటు హాస్టల్ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వివిధ సంఘాల నాయకులు ఆరోపించారు.


క్షుణ్ణంగా పరిశీలించాకే.. మైనారిటీ సర్టిఫికెట్

సాక్షి, హైదరాబాద్: పోటీ పరీక్షల్లో కౌన్సెలింగ్ సమయంలో విద్యార్థులకు మైనారిటీ హోదా సర్టిఫికెట్ జారీకి ముందు అభ్యర్థులు సమర్పించిన వివరాలను, దరఖాస్తు కారణాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. మైనారిటీ సంక్షేమ శాఖ విజ్ఞప్తి మేరకు రెవెన్యూ శాఖ ముఖ్యకార్యదర్శి నవీన్ మిత్తల్ ఈ మేరకు విద్యార్థులకు ఇచ్చే మైనారిటీ సర్టిఫికెట్ నమూనా కూడా జీవోతో పాటు శనివారం జారీ చేశారు. ముస్లింలు, క్రిస్టియన్లు, సిక్కులు, జైనులు, బుద్దిస్ట్, జొరాస్ట్రియన్స్‌కు ఈ మైనారిటీ సర్టిఫికెట్ జారీ చేసేటప్పుడు విద్యార్థులు దేనికోసం ఈ సర్టిఫికెట్ కావాలంటున్నారో లిఖితపూర్వకంగా రాయించుకోవాలని ఆదేశించారు. ఇంటిగ్రేటెడ్ కమ్యూనిటీ సర్టిఫికెట్ ఇచ్చే సమయంలో తహసీల్దార్‌లు ఆ కుల గ్రూపును పేర్కొనడం, ఎస్సెస్సీ లేదా బదిలీ సర్టిఫికెట్‌లో వారి జాతీయత, మతం, నీట్, ఎంసెట్ లేదా జాతీయ, రాష్ట్ర పోటీ పరీక్షలకు హాజరైన అడ్మిట్ కార్డు, ఆధార్ కార్డు/రేషన్ కార్డు తీసుకుని పరిశీలించాకే జారీ చేయాలని ఆదేశించారు.

రంగారెడ్డి జిల్లా టీచర్ల పదోన్నతులపై...

ఈ నెల 19 వరకు స్టే

హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు



సాక్షి, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా టీచర్ల పదోన్నతులపై ఈ నెల 19 వరకు హైకోర్టు స్టే విధించింది. ప్రాథమిక సీనియారిటీ జాబితా ఆధారంగా పదోన్నతులు ఇవ్వడాన్ని తప్పుబడుతూ.. డీఈవో, డీఎస్‌ఈతో పాటు పాఠశాల విద్యా శాఖ ముఖ్య కార్యదర్శికి నోటీసులు జారీ చేసింది. కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ, ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు వెలువరించింది. తదుపరి విచారణను ఈ నెల 19కి వాయిదా వేసింది. అధికారులు ఇతర జిల్లాలకు చెందిన టీచర్లను కూడా రంగారెడ్డి జిల్లాకు కేటాయిస్తున్నారని, ఇది రాష్ట్రపతి ఉత్తర్వులకు, నిబంధనలకు విరుద్ధమని పేర్కొంటూ టి.శ్రీనివాస్‌రెడ్డి సహా పలువురు స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. జీవో 317 ద్వారా ఇతర జిల్లాల టీచర్లను రంగారెడ్డి జిల్లాకు కేటాయించారని, కేడర్‌ను మించిపోతే ఈ జిల్లాకు చెందిన తాము నష్టపోతామని వారు పేర్కొన్నారు. ఈ పిటిషన్లపై జస్టిస్ పి.మాధవీదేవి ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. అధికారులు తాత్కాలిక సీనియారిటీ జాబితాను సిద్ధం చేసి బదిలీలు చేపడుతున్నారు. దీనిపై పిటిషనర్ల అభ్యంతరాలకు కూడా అవకాశం ఇవ్వలేదని చెప్పారు. రాజ్యాంగం ప్రకారం ఇది సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమన్నారు. అయితే తుది సీనియారిటీ జాబితాను జారీ చేయకుండా ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించడం లేదని, పిటిషనర్లు లేవనెత్తిన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోకుండా అధికారులు పదోన్నతులు ఇవ్వడం లేదని ప్రభుత్వ న్యాయవాది వాదించారు. లంచ్‌మోషన్‌లో పిటిషన్ వచ్చినందున వివరాలు తెలుసుకోవడానికి ఈనెల 19 వరకు సమయం కావాలని కోరారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం.. తదుపరి విచారణను 19కి వాయిదా వేస్తూ, అప్పటివరకు బదిలీలు, పదోన్నతులు నిలిపివేస్తున్నట్లు ఉత్తర్వులు జారీచేసింది.

జిల్లా వార్తలు

వంట షెడ్డుకు రూ.50 వేల విరాళం


వంటషెడ్ వద్ద విద్యార్థులతో ప్రజాప్రతినిధులు

తల్లాడ: మండలంలోని అన్నారుగూడెం జెడ్పీహెచ్‌ఎస్‌లో వంట షెడ్డు నిర్మాణానికి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ సీతారామపట్నం గ్రామానికి చెందిన ఎన్‌ఆర్‌ఐ వాసిరెడ్డి దయానంద్ రూ.50 వేలు విరాళం అందజేశారు. పాఠశాలలో వంట షెడ్డు లేక ఎదురవుతున్న ఇబ్బందులను గుర్తించిన ఆయన బోడేపూడి విజ్ఞాన కేంద్రం సౌజన్యంతో విరాళం అందజేయగా నిర్మాణం పూర్తయింది. శనివారం షెడ్డును ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ మారెళ్ల మమత ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఈఓ దామోదరప్రసాద్, హెచ్‌ఎం బి.రమేశ్‌తో పాటు మాదినేని రమేష్, ఎంఎం రాజకుమారి, పులి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

1,254 కార్లతో విజయభేరికి 'పొంగులేటి' అనుచరులు

ఖమ్మంమయూరిసెంటర్: హైదరాబాద్‌లో ఆదివారం కాంగ్రెస్ ఆధ్వర్యాన జరగనున్న విజయభేరి సభకు ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి కాంగ్రెస్ ప్రచార కమిటీ కోచైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి అనుచరులు భారీగా తరలివెళ్లనున్నారు. సుమారు 1,254 కార్లలో వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకున్నారని పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని నియోజకవర్గాల నుంచి ఉదయం 10 గంటలకు నాయకులు ఖమ్మం చేరుకోనుండగా, ఇక్కడి నుంచి ర్యాలీగా హైదరాబాద్ బయలుదేరతారని చెప్పారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

భద్రాచలం: భద్రాచలం ఐటీడీఏ ఆధ్వర్యాన ఖమ్మం, భద్రాద్రి జిల్లాల పరిధిలోని గిరిజన నిరుద్యోగ మహిళలకు రెండు నెలలు ఉచితంగా ఐటీఈఎస్, వెబ్ మొబైల్ శిక్షణ ఇవ్వనున్నట్లు పీఓ ప్రతీక్‌జైన్ తెలిపారు. ఈ శిక్షణకు ఇంటర్ లేదా డిగ్రీ ఉత్తీర్ణులై, 18–25 ఏళ్ల వయస్సు కలిగిన మహిళలు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు విద్యార్హత పత్రాలు, ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ జిరాక్స్‌తో ఈ నెల 20న ఉదయం 9 గంటలకు తమ కార్యాలయంలో జరిగే కౌన్సెలింగ్‌కు హాజరుకావాలన్నారు.

వెబ్‌సైట్ నిర్వహణకు దరఖాస్తుల ఆహ్వానం

ఐటీడీఏలో వెబ్‌సైట్ నిర్వహణకు వ్యక్తులు, సంస్థల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పీఓ తెలిపారు. ఆసక్తి గలవారు కార్యాలయ స్టాటిస్టికల్ విభాగంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

కార్మికులకు మెరుగైన వైద్యసేవలు


సమావేశంలో మాట్లాడుతున్న డైరెక్టర్ బలరామ్

సమీక్ష సమావేశంలో సింగరేణి డైరెక్టర్ బలరామ్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కార్మికులకు మెరుగైన వైద్యం అందేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని డైరెక్టర్ ఎస్.బలరామ్ సూచించారు. కొత్తగూడెంలోని ప్రధాన ఆస్పత్రిలో శనివారం ఆయన సింగరేణి చీఫ్ మెడికల్ ఆఫీసర్ (సీఎంఓ)తో పాటు అన్ని ఏరియాల డిప్యూటీ చీఫ్ మెడికల్ ఆఫీసర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ.. కార్మికులకు మెరుగైన వైద్యం అందించాలనేదే సంస్థ లక్ష్యమని తెలిపారు. ఇప్పటికే ఆస్పత్రుల్లో అన్ని సౌకర్యాలు కల్పించగా, వైద్యనిపుణులను కూడా నియమించామని చెప్పారు. ఈ మేరకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించి కావాల్సిన మందులను సమకూర్చుకోవడమే కాక వైద్యులు సమయపాలన పాటించేలా చూడాలని సూచించారు. సమావేశంలో సీఎంఓ పి.సుజాత, ఏసీఎంఓ విక్టర్ వందనం, డీవైసీఎంఓలు సునీల, పద్మజ, కిరణ్‌రాజ్‌కుమార్, ఉషారాణి, ఎం.కుమారి, పి.రమేశ్‌బాబు, కె.బాలకోటయ్య, మల్లారెడ్డి, సీనియర్ పీఓ మండల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వృక్షాలతో మానవాళికి మేలు

మణుగూరుటౌన్: పర్యావరణాన్ని పరిరక్షించడంతో పాటు మానవాళి మనుగడలో మొక్కలు కీలకపాత్ర పోషిస్తాయని సింగరేణి డైరెక్టర్ బలరామ్ తెలిపారు. మణుగూరు ఏరియాలో శనివారం పర్యటించిన ఆయన ఓసీలో మొక్కలు నాటి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న హరితహారంలో భాగంగా ప్రతీఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. అనంతరం జీఎం దుర్గం రాంచందర్ మాట్లాడగా, అధికారులు, నాయకులు వీసం కృష్ణయ్య, డి.వెంకటేశ్వర్లు, నర్సిరెడ్డి, రవీందర్, వి.ప్రభాకర్‌రావు, రాంగోపాల్, జాన్, ప్రసాద్, కొడిపల్లి శ్రీలత, భుక్యా కిషన్, షబ్బీర్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

త్యాగాల చరిత్ర కమ్యూనిస్టులదే


బోనకల్ : బ్రాహ్మణపల్లిలో అమరవీరుల స్థూపం వద్ద మాట్లాడుతున్న సాంబశివరావు

- పోరాట ఫలితంగానే తెలంగాణకు స్వేచ్ఛ
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

బోనకల్/చింతకాని: త్యాగాల చరిత్ర కమ్యూనిస్టులదేనని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తెలిపారు. బోనకల్ మండలం చిరునోముల, బ్రాహ్మణపల్లి, గోవిందాపురం(ఎల్), లక్ష్మీపురంతో పాటు చింతకాని మండలం ప్రొద్దుటూరులో శనివారం నిర్వహించిన తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల ముగింపు సభల్లో ఆయన పాల్గొన్నారు. తొలుత అమరవీరుల స్తూపాల వద్ద నివాళులర్పించిన కూనంనేని మాట్లాడుతూ.. భూమి, భుక్తి కోసమే కాక బానిసత్వానికి వ్యతిరేకంగా కమ్యూనిస్టులు వీరోచితంగా పోరాడారన్నారు. ఇవాళ తెలంగాణ పేరు చెప్పుకుంటున్న పార్టీలది కేవలం ఓట్ల చరిత్రేనని ఆరోపించారు. ఏ గ్రామంలో చూసినా కనిపించే పోరాట స్మృతులు అమరుల త్యాగాలకు గుర్తులని తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి సైతం తెలంగాణ పోరాటంపై చిత్తశుద్ధి లేదని.. కేసీఆర్ కపట నాటకాలకు కేరాఫ్‌గా నిలుస్తున్నారని ఆరోపించారు.

బీఆర్‌ఎస్ సమైక్యతాదినం ఎందుకు నిర్వహిస్తుందో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమాల్లో సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు బాగం హేమంతరావు, ఖమ్మం జిల్లా జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, నాయకులు తోట రామాంజనేయులు, ఏనుగు గాంధీ, యంగల ఆనందరావు, మందడపు రాణి, తూము రోషన్‌కుమార్, కొంగర రామారావు, జక్కా నాగభూషణం, జమ్ముల జితేందర్‌రెడ్డి, ఏపూరి రవీంద్రబాబు, పగిడిపల్లి ఏసు, పావులూరి మల్లికార్జున్‌రావు, దూసరి గోపాల్‌రావు, అబ్బూరి మహేశ్, పదిమెల వెంకట నర్సయ్య, బక్కిరెడ్డి, తాళ్లూరి యాదగిరి, రమేశ్, జానకీరాములు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో కార్మిక ఐక్య ఉద్యమాన్ని నిర్మిద్దాం


నినాదాలు చేస్తున్న నాయకులు

ఖమ్మంమామిళ్లగూడెం: ఆర్టీసీలో ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఐక్య ఉద్యమాన్ని నిర్మించాల్సిన అవసరముందని ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు పేర్కొన్నారు. సంఘం 45వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం ఖమ్మం డిపో ఎదుట పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం గుండు మాధవరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కల్యాణం వెంకటేశ్వరావు మాట్లాడుతూ.. ఐక్య పోరాటాల రూపకల్పన, నిర్మాణంలో ఎస్‌డబ్ల్యూఎఫ్ అగ్రభాగాన నిలిచిందన్నారు. ప్రస్తుతం కూడా అదేపాత్ర పోషిస్తూ ఆర్టీసీ విలీనం కంటే ముందు మిగిలిపోయిన సమస్యల పరిష్కారానికి పాటుపడాలన్నారు. ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి గడ్డం లింగమూర్తి మాట్లాడుతూ.. పే స్కేల్ వర్తింపజేయడంతో పాటు పెండింగ్‌లో ఉన్న ఎరియర్స్ చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రీజియన్ కార్యదర్శి పిట్టల సుధాకర్‌తో పాటు తోకల బాబు, రమేష్, నర్సింహారావు, వెంకటేశ్వర్లు, కిరణ్, ఐతం రాజు, నాగేశ్వరరావు, భాస్కర్, ఎండీ గౌస్, శంకర్, కుమార్, వెంకయ్య, మొహబూబ్ తదితరులు పాల్గొన్నారు.

సత్తాచాటిన 'ఏకలవ్య' విద్యార్థులు


బహుమతులతో విద్యార్థులు

ములకలపల్లి: అంకంపాలెంలో కొనసాగుతున్న ములకలపల్లి ఏకలవ్య మోడల్ స్కూల్ (ఈఎంఆర్‌ఎస్) విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తాచాటారు. ఇటీవల సిర్పూర్ కాగజ్‌నగర్‌లో జరిగిన నాలుగో రాష్ట్రస్థాయి 4వ కల్చరల్ ఫెస్ట్‌లో పాల్గొన్న విద్యార్థులు వివిధ విభాగాల్లో బహుమతులు గెలుచుకున్నారు. పాఠశాల నుంచి 66 మంది విద్యార్థులు పాల్గొనగా ఎనిమిది విభాగాల్లో బహుమతులు లభించాయి. ఈ సందర్భంగా ఆర్‌సీఓ డేవిడ్‌రాజ్, ప్రిన్సిపాల్ రాజేశ్, వైస్ ప్రిన్సిపాల్ బానోతు లక్ష్మి, ఉపాధ్యాయులు ఎం.చైతన్య, ఎం.శ్రీనివాస్ తదితరులు శనివారం అభినందించారు.

సెప్టెంబర్ 17 ముమ్మాటికీ విద్రోహదినమే..

పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆజాద్


సదస్సులో మాట్లాడుతున్న ఆజాద్

ఖమ్మంరావర్తినగర్: తెలంగాణ ప్రజలను మోసం చేసేలా సెప్టెంబర్ 17ను సమైక్యత, విమోచనం, విలీనం పేరుతో నిర్వహిస్తున్న పార్టీలు చరిత్రను వక్రీకరించే కుట్రలు చేస్తున్నాయని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నామాల ఆజాద్ విమర్శించారు. అయితే, ఎవరెన్ని కుట్రలు చేసినా కచ్చితంగా విద్రోహ దినమేనని తెలిపారు. ఖమ్మంలోని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 'తెలంగాణలో సెప్టెంబర్ 17న ఏం జరిగింది?'అంశంపై శనివారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. కమ్యూనిస్టుల నాయకత్వాన ప్రజలు రజాకార్లను మట్టి కరిపించారని తెలిపారు. అయితే, ప్రజలను విభజించి పాలించడానికి నాటి కాంగ్రెస్ నుంచి నేటి బీజేపీ వరకు రకరకాల కుట్రలు చేస్తున్నాయని ఆరోపించారు. కాగా, తెలంగాణలో అధికారంలోకి రావాలని కలలు కంటున్న బీజేపీ, ఆర్ఎస్ఎస్ మతోన్మాదులు విమోచన దినం పేరిట చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ప్రజలందరూ ఈనెల 17న విద్రోహ దినంగానే పాటించాలని ఆజాద్ కోరారు. సదస్సులో పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్‌తో పాటు నాయకులు సతీశ్, లక్ష్మణ్, కరుణ్, శివ, సతీశ్, నాయకులు శ్రీను, చందు పాల్గొన్నారు.

ఉత్పత్తి చేసేదే మనం కదా..!

- కేటీపీఎస్‌లో విద్యుత్ దుబారా
- కర్మాగారంలో రాత్రింబవళ్లు వెలుగుతున్న హైమాస్ట్ లైట్లు


కేటీపీఎస్ 7వ దశలోని భవనాలపై పగలు కూడా వెలుగుతున్న లైట్లు

పాల్వంచ: విద్యుత్ ఉత్పత్తి చేసేదే మనం కదా.. అని అనుకుంటున్నారో ఏమో తెలియదు కానీ పాల్వంచలోని కేటీపీఎస్ కర్మాగారంలో రాత్రింబవళ్లు హైమాస్ట్ లైట్లను ఆర్పివేయకుండా కొనసాగిస్తున్నారు. విద్యుత్ ఉత్పత్తి చేసే రాత్రి వేళ లైట్ల వెలుగులు అవసరముంటుంది. ఇందుకోసం ఏర్పాటుచేసిన భారీ హైమాస్ట్ లైట్ల వల్ల విద్యుత్ అధికంగా వినియోగమవుతుంది. అయితే, పగటి వేళ కొన్ని విభాగాల్లోనే కాక ఆవరణలో లైట్ల అవసరం ఉండదు. అయినప్పటికీ వీటిని ఆర్పేయకపోవడంతో 24 గంటలూ లైట్లు వెలుగుతూనే ఉంటున్నాయని పలువురు వాపోతున్నారు. తద్వారా విద్యుత్ వృథా కావడమే కాక లైట్ల జీవితకాలం తగ్గుతుందని చెబుతున్నారు. కర్మాగారంలోని స్విచ్ యార్డు, క్యాంటీన్, ఫైర్ స్టేషన్, స్టోర్, సీఈ కార్యాలయం ఇలా అనేక ఏరియాల్లో భవనాలపై హైమాస్ట్ లైట్లు నిరంతరం వెలుగుతున్నా సిబ్బంది పట్టించుకోకపోవడం, అధికారులు పర్యవేక్షించకపోవడం విమర్శలకు తావిస్తోంది.